
సాక్షి
నాగర్‌కర్నూల్
ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



పూర్వవైభవం వచ్చేనా..?

అలంపూర్ పుణ్యక్షేత్రాల పరిధిలోని 64 స్నానపు ఘాట్లు ఉనికి కోల్పోతున్నాయి.

వివరాలు 8లో ▸



కప్పేసిన గుర్రపు డెక్క

మహబూబ్‌నగర్‌లోని వివిధ చెరువులు, కుంటలను గుర్రపు డెక్క కప్పేస్తుంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.5 /21.4

వాతావరణం

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

ప్రణాళికతో ముందుకు..

అచ్చంపేట రూరల్: పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తామని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్లు, ప్రజల సహకారంతో పట్టణాన్ని అన్నిరంగాల్లో ముందుంచుతామని అచ్చంపేట మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు అన్నారు. శనివారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు కమిషనర్‌కు నేరుగా ఫోన్ చేసి తమ సమస్యలను చెప్పగా.. ఆయన పరిష్కార మార్గాలు వివరించారు. అన్ని వార్డులను పర్యవేక్షిస్తున్నామని, మున్సిపల్ పాలకవర్గంతో చర్చించి అవసరం ఉన్నచోట అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని, ఇప్పటికే పలు వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కుక్కలు, పందులను పట్టణ శివారు బయట ఉంచేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఆహార, ఇతర వ్యర్థ పదార్థాలను బయట పడేయకుండా ఇళ్ల వద్దకు వచ్చే చెత్తబండికి అందించాలన్నారు. కుక్కలు ఏయే కాలనీల్లో అధికంగా ఉన్నాయో పరిశీలించి వాటి పరిస్థితులను గమనించడానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో 4 టీంలను ఏర్పాటు చేశామన్నారు. పెంపుడు కుక్కలకు మున్సిపల్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్‌హౌస్, చికెన్, మటన్, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి ఆహార వ్యర్థాలను రోడ్లకు ఇరువైపులా వేయకుండా సూచిస్తామన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమన్నారు.

- ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం
- వార్డులకు ప్రత్యేక అధికారులను నియమిస్తాం
- ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి
- అచ్చంపేట మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన



'సాక్షి' ఫోన్

ప్రశ్న: మా కాలనీలో డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు రోడ్లపైనే పారుతుంది. దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంది. వీధిలైట్లు వెలగడం లేదు.
– నిరంజన్, వెంకటస్వామి– ఏడో వార్డు, మహేష్, వాణి– జూబ్లీనగర్, కుమార్– ఆదర్శనగర్, మోతీలాల్– మధురానగర్, రతన్‌కుమార్– సాయినగర్.
కమిషనర్: వీధిలైట్లను వెంటనే ఏర్పాటు చేస్తాం. సిబ్బందితో కాల్వలు శుభ్రం చేయిస్తాం. కొత్త కాల్వల నిర్మాణానికి కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తా.

ప్రశ్న: పట్టణంలో కుక్కలు, పందులు, కోతుల బెడద తీవ్రంగా ఉంది. – ప్రియాంక, 9వ వార్డు, రాంమోహన్‌రావు, అడ్వకేట్
కమిషనర్: కుక్కలను పరిశీలించడానికి పట్టణంలో 4 టీంలు ఏర్పాటు చేశాం. పందుల పెంపకం దారులకు నోటీసులు అందించాం. కోతులను పట్టుకునే వారిని త్వరలోనే పిలిపిస్తాం.

ప్రశ్న: టీచర్స్‌కాలనీలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలి.
– శ్రీశైలం, ఉపాధ్యాయుడు
కమిషనర్: సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేస్తాం. సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం.

ప్రశ్న: పందుల పెంపకందారులకు స్థలాన్ని కేటాయించి పట్టణానికి దూరంగా ఉంచేలా చూడాలి.
– ఖలీల్, విష్ణు, జ్యోతి, మారుతీనగర్.
కమిషనర్: ఇప్పటికే పందుల పెంపకందారులకు నాలుగు సార్లు నోటీసులు అందించాం. పట్టణ శివారుకు దూరంగా ఉండేలా చూడాలని ఆదేశాలు జారీ చేశాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మధురానగర్ మూడో రోడ్డులో కంపచెట్లను తొలగించాలి.
– లాలయ్య, మధురానగర్ కాలనీ
కమిషనర్: రెండు రోజుల్లో కంప చెట్లను తొలగిస్తాం.

ప్రశ్న: వెంకటేశ్వరనగర్‌కాలనీలో మురుగు కాల్వలు నిర్మించాలి.
– శ్రీధర్– టీచర్, రాజాప్రతాప్, మాజీ ఆర్మీజవాన్, వెంకటేశ్వరనగర్ కాలనీ
కమిషనర్: మున్సిపల్ చైర్మన్, కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం.

ప్రశ్న: పట్టణంలోని 18వ వార్డు, విద్యానగర్ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదు. మూడో వార్డులో బోరు మోటారు రిపేర్ చేయాలి.
– మాధవి– 18వ వార్డు, శివకుమార్– 3వ వార్డు, పద్మ– విద్యానగర్‌కాలనీ, కృష్ణ– జూబ్లీనగర్, సాయిరాం– 18వ వార్డు.
కమిషనర్: వాటర్‌మెన్‌లతో కలిసి వార్డును పరిశీలిస్తాం. సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరిస్తాం. 3వ వార్డులో బోరు మోటారు రిపేర్ చేయిస్తాం.

ప్రశ్న: ఆర్టీసీ బస్ డిపో వెనక వీధిలైట్లు ఏర్పాటు చేయాలి. – అష్రఫ్, పట్టణవాసి
కమిషనర్: రెండు రోజుల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తాం.

ప్రశ్న: పట్టణంలోని నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి మంజు టెంట్ హౌజ్ వెనక భాగంలో వర్షపు నీరు నిలిచి దుర్గంధం వస్తుంది.
– తాహేర్‌పాష, టీచర్
కమిషనర్ : పరిశీలించి పరిష్కరిస్తాం.

ప్రశ్న: అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి.
– మండికారి బాలాజీ, మణికంఠ, అచ్చంపేట
కమిషనర్: నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టకపోతే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పాతబజార్‌లో మోడల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి.
– గౌరీశంకర్, కౌన్సిలర్
కమిషనర్: పాతబజార్‌లో త్వరలోనే టాయిలెట్లు ఏర్పాటు చేస్తాం. కౌన్సిల్ తీర్మానం కూడా ఆమోదం పొందింది.

ప్రశ్న: సాయినగర్‌కాలనీ మల్లంకుంట ప్రదేశంలో, హాస్టళ్ల సమీపంలో చికెన్ వ్యర్థాలు పడవేస్తున్నారు. దుర్గంధం వెదజల్లుతోంది.
– అరవింద్, సాయినగర్
కమిషనర్: చికెన్ సెంటర్ నిర్వాహకులను పిలిపించి హెచ్చరికలు చేస్తాం. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేలా చూస్తాం. నిబంధనలు పాటించకపోతే జరిమానా విధించి చర్యలు తీసుకుంటాం.

ఆవేదన.. ఆందోళన



మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయం వద్ద నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

- గ్రూప్‌–1 రద్దుతో అభ్యర్థుల్లో గందరగోళం
- ఈ పరీక్షల కోసమే ఏడాది నుంచి సిద్ధమవుతున్న వైనం
- కోచింగ్ సెంటర్లు, పుస్తకాల కోసం రూ.వేలల్లో ఖర్చు
- ఉమ్మడి జిల్లాలో పరీక్ష రాసిన 20,066 మంది నిరుద్యోగులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్‌– 1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది. గతేడాది చివరన పేపర్ లీక్ కావడంతో మొదటిసారి ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేసిన అనంతరం.. తిరిగి జూన్‌లో నిర్వహించారు. ఈసారి కూడా పరీక్ష నిర్వహణ సరిగా లేదని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తవుతుంది. పరీక్ష రద్దు చేసి నిర్వహించే ప్రతిసారి నెలల తరబడి సిద్ధమవడం, రూ.వేలల్లో డబ్బులు ఖర్చు కావడం వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత జూన్‌లో నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 20,066 మంది అభ్యర్థులు హాజరయ్యారు. గ్రూప్‌–1 స్థాయి పరీక్ష నిర్వహణలో టీఎస్‌పీఎస్సీ విఫలమైతే గ్రూప్‌–4తో పాటు ఇతర కిందిస్థాయి పరీక్షలు ఎలా చేపడతారని పలువురు అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం పెద్దఎత్తున నోటిఫికేషన్లు ఇస్తుండగా.. మళ్లీ గ్రూప్‌–1 పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్థిక ఇబ్బందుల్లో అభ్యర్థులు..

పోటీ పరీక్షలకు సిద్ధమవడం అంటే ఎంతో సమయం కేటాయించాలి. ఎన్నో డబ్బులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒక్కసారి గ్రూప్స్ కోచింగ్ తీసుకుంటే దాదాపు రూ.20–30 వేల వరకు ఖర్చు అవుతాయి. ఇక మెటీరియల్స్, నోట్ పుస్తకాలు, ఇతర ఖర్చులు రూ.10 వేల వరకు వస్తుంది. అలాగే హాస్టల్ లేదా రూంలో ఉండాల్సి వస్తే మరో రూ.10 వేల వరకు వెచ్చించాల్సిందే. చాలామంది ప్రైవేటు లేదా ప్రభుత్వ సెక్టార్‌లలో, ఔట్ సోర్సింగ్‌లలో పని చేసే వారు ఉద్యోగాలను వదులుకుని పరీక్షలకు సిద్ధమవుతారు. ఇక కొంత తల్లిదండ్రుల మీద ఆధారపడి చదివే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఉద్యోగం వస్తుందని భావించిన తల్లిదండ్రులకు అభ్యర్థులు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది. భార్యాభర్తలుగా ఉండి పిల్లలను పెట్టుకుని సిద్ధమయ్యే వారు ఎన్నో రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే చాలామంది ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ ప్రిపరేషన్‌ను వదిలిపెట్టి పనులు చేసుకునేందుకు వెళ్తున్నారు.

గ్రూప్‌–1 పరీక్ష రాసిన వారు..

జిల్లా	హాజరైన అభ్యర్థులు
మహబూబ్‌నగర్	8,408
నాగర్‌కర్నూల్	3,536
జోగులాంబ గద్వాల	3,435
వనపర్తి	3,176
నారాయణపేట	1,511

చదవాలా.. వద్దా..

ఏడాది నుంచి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు గ్రూప్‌–1 పరీక్ష రద్దు చేయడంతో అయోమయంలో పడ్డారు. ఇన్ని రోజులు గ్రూప్స్ మెయిన్స్ పరీక్ష ఉంటుందని సిద్ధమయ్యారు. ఇక గ్రూప్‌–3, హాస్టల్ వెల్ఫేర్ వార్డెన్ వంటి పరీక్షకు దరఖాస్తు తీసుకున్న బోర్డు ఇప్పటికీ పరీక్ష నిర్వహణపై ఎలాంటి తేదీలను ప్రకటించలేదు. అలాగే టీఆర్టీ వంటి పరీక్షల్లో అరకొర పోస్టులు కేటాయించడంతో వాటిని పెంచాలని ఆందోళనలకు దిగుతున్నారు. ఈ క్రమంలోనే గ్రూప్‌–1 పరీక్ష రద్దు చేయడంతో చదవాలా.. వద్దా అనే మీమాంసలో అభ్యర్థులు పడిపోయారు. ఇప్పటికే గ్రూప్‌– 2 పరీక్ష నవంబర్‌లో నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయనే ప్రచారం జరుగుతుంది.

నమ్మకం కోల్పోతుంది..



ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్లుగా శ్రమించి.. కష్టపడి చదివి.. రాసిన పరీక్షలను రద్దు చేయడం నియామక బోర్డు అసమర్థతే. పరీక్షలు నిర్వహించే సమయంలోనే అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సింది. పరీక్షలు రాసిన తర్వాత ఫలితాల కోసం ఎదురుచూసే సమయంలో ఇప్పుడు పరీక్ష రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే గ్రూప్‌–1 పరీక్ష రెండుసార్లు రద్దు కావడం చూస్తే.. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తోంది.
– ప్రశాంత్, అభ్యర్థి, కల్వకుర్తి

ఆత్మస్థైర్యం దెబ్బతింటోంది..



ప్రభుత్వ ఉద్యోగంపై ఆశతో సన్నద్ధమైన వారికి గ్రూప్‌–1 పరీక్ష రద్దుతో నియామక ప్రక్రియపై నమ్మకం లేకుండా పోయింది. సంబంధిత నియామక బోర్డు నోటిఫికేషన్ సమయంలోనే లోపభూయిష్టంగా ఇవ్వడం తీవ్రమైన నిర్లక్ష్యం. ఏళ్లుగా ప్రిపేర్ అవుతూ కోచింగ్‌లకు డబ్బులు లేక అప్పులు చేసి చదువుకోవాల్సి వస్తోంది. మళ్లీ మళ్లీ పరీక్షలు రాస్తుండటంతో అభ్యర్థుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతింటోంది. ప్రభుత్వం అభ్యర్థులకు తగిన విధంగా నష్టపరిహారం చెల్లించాలి.
– మజహర్, అభ్యర్థి, కల్వకుర్తి

టీఎస్‌పీఎస్సీ విఫలం..



గ్రూప్‌–1 పరీక్ష నిర్వహణలో టీఎస్‌పీఎస్సీ విఫలమైంది. మొదటిసారి పరీక్ష రద్దు అయినప్పుడు రెండోసారి తప్పులు జరగకుండా నిర్వహించాల్సింది. ఇందులో ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా ఉంది. నేను ప్రైవేటు ఉద్యోగం మానేసి ఆరు నెలల పాటు గ్రూప్‌–1 పరీక్ష కోసం ప్రిపేర్ అయ్యా. కీ పేపర్‌లో క్వాలిఫై మార్కులు వచ్చాయి. పరీక్ష రద్దు వల్ల హాస్టల్‌కు, తిండి, పుస్తకాలకు వెచ్చించిన డబ్బులతోపాటు సమయం కూడా వృథా అయ్యింది.
– రామచంద్రయాదవ్, అభ్యర్థి, కొల్లాపూర్

నిరాశ కలిగించింది

గ్రూప్‌–1 పరీక్ష రెండోసారి రద్దు కావడం నిరాశ కలిగించింది. మొదటిసారి పరీక్ష రద్దు కావడంతో రెండోసారి కష్టపడి చదివా. ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటూనే డ్యూటీ అయిపోయాక చదువుకే పూర్తి సమయం కేటాయించా. రెండోసారి రాసిన పరీక్షల్లో కీ పేపర్ ప్రకారం నేను క్వాలిఫై అవుతాను. మళ్లీ పరీక్షలకు సన్నద్ధం కావడం కష్టమైనపనే.
– స్వామి, అభ్యర్థి, కొల్లాపూర్

న్యూస్‌రీల్

మానిటరింగ్ కమిటీదే కీలక పాత్ర



నాగర్‌కర్నూల్: రాబోయే ఎన్నికల్లో అభ్యర్థులు పెట్టుకునే ప్రకటనల దరఖాస్తులను సత్వరమే అనుమతులు ఇచ్చే విధంగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు శనివారం కలెక్టరేట్ ఎన్ఐసీ హాల్‌లో ఎంసీఎంసీ కమిటీతో సమావేశం, శిక్షణలో పాల్గొన్నారు. మాస్టర్ శిక్షకుడు చంద్రశేఖర్ మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ సభ్యులకు పవర్ పాయింట్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి అభ్యర్థులు టీవీ, సినిమా హాల్, బయట వీడియో తెర, సోషల్ మీడియా ద్వారా ఇచ్చే అన్ని రకాల ప్రకటనలకు మూడు రోజులు ముందుగానే ఎంసీఎంసీ కమిటీకి దరఖాస్తు చేసుకుంటారని, ఎన్నికల నిబంధనల మేరకు ఉన్నాయా.. లేదా అని క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పెయిడ్ న్యూస్ ఏవిధంగా ఉంటాయి.. వాటిని ఎలా గుర్తించాలి వంటి అంశాలపై కమిటీ సభ్యులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే సులువుగా అనుమతులు మంజూరు చేయవచ్చన్నారు. రాబోయే రోజుల్లో మరి కొన్ని సమావేశాలు నిర్వహించి పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మీడియా, రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ ఆవశ్యకత, పనితీరుపై అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, సీతారామారావు, డీపీఆర్ఓ సీతారాం, డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్, కమిటీ సభ్యులుగా ఇండిపెండెంట్ జర్నలిస్ట్ దినకర్, రిటైర్డు ఎంప్లాయ్ శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు సౌత్ జోన్ ఎంపికలు

కందనూలు: ఖేలో ఇండియా తెలంగాణ రాష్ట్ర సౌత్ జోన్ జూనియర్స్, సబ్ జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల కోసం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానాన్ని జిల్లా ఖోఖో అసోసియేషన్ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి తెలంగాణ 10 జిల్లాల నుంచి జిల్లాకు పదిమంది చొప్పున దాదాపు 120 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

పాలమూరుపై బీజేపీ నజర్

'పట్టు' సాధించి.. పాగా వేయాలని..



అమిస్తాపూర్ వద్ద బహిరంగసభ స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

దక్షిణ తెలంగాణలో సత్తా చాటేలా ప్రణాళిక

- మహబూబ్‌నగర్ నుంచి వ్యూహాత్మక అడుగులకు శ్రీకారం
- వచ్చేనెల 1న భారీ బహిరంగసభ.. ప్రధాని మోదీ రాక
- ఐదారు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరు నుంచే ఎన్నికల శంఖారావం పూరించేందుకు బీజేపీ సిద్ధమైంది. ఇందులో భాగంగా అక్టోబర్ 1వ తేదీన మహబూబ్‌నగర్‌లో భారీ బహిరంగసభకు కసరత్తు ప్రారంభించింది. ఈ సభకు స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ హాజరుకానుండగా.. ఆ పార్టీ పెద్దలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో హైకమాండ్ ఉమ్మడి జిల్లాపై ఫోకస్ పెట్టిందని.. దీని వెనుక భారీ ప్రణాళిక ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో ఉన్న ఈ జిల్లాపై పట్టు సాధించడం ద్వారా దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మెజార్టీ సీట్లను సాధించాలనే వ్యూహాన్ని పక్కాగా అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పీఎల్ఆర్ఐఎస్ చుట్టేనా?

దక్షిణ తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు వరప్రదాయిని అయిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ఇటీవల ప్రారంభించిన విషయం తెలిసిందే. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నార్లాపూర్ పంప్‌హౌస్ వద్ద ఆయన స్విచాన్ చేసి మొదటి మోటార్‌ను ప్రారంభించి కృష్ణా జలాలను అంజనగిరి రిజర్వాయర్‌లోకి వదిలిపెట్టారు. దీనిపై ఇప్పటికే కాంగ్రెస్ ఒక్క మోటార్‌తోనే ప్రాజెక్ట్ ప్రారంభించడం వెనుక వచ్చే ఎన్నికల్లో గెలుపొందడానికి బీఆర్ఎస్ వేసిన జిమ్మిక్కు అనే ప్రచారం మొదలుపెట్టింది. క్షేత్రస్థాయిలో ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టింది. ఈ క్రమంలో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోరు కొనసాగుతున్నట్లు దక్షిణ తెలంగాణలో చర్చ జోరుగా సాగుతోంది. దీన్ని తిప్పికొట్టడంతో పాటు ఈ ప్రాజెక్టను బేస్ చేసుకుని.. అధికార బీఆర్ఎస్‌ను ఢీ కొట్టేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు సమాచారం. దీని ఆధారంగానే దక్షిణ తెలంగాణలో పట్టు సాధించి, పాగా వేయాలనే సంకల్పంతో పార్టీ పెద్దలు స్కెచ్ వేసినట్లు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. కృష్ణానదిలో వాటా తేల్చడంలో కేంద్రం మొండి వైఖరి అవలంబిస్తోందని.. దీని ద్వారా తెలంగాణ, ప్రధానంగా పాలమూరుకు అన్యాయం జరుగుతోందని ఇటీవల సభలో సీఎం కేసీఆర్ వెల్లడించిన విషయం తెలిసిందే. దీనికి కౌంటర్‌గా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభజనలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలనే అంశం చేర్చకపోవడం.. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తమ స్కీంలుగా చెప్పుకుంటోందంటూ అంశాల వారీగా ఇటు బీఆర్ఎస్, అటు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించేలా ప్రధాని తదితర ముఖ్య నేతల బహిరంగసభలకు శ్రీకారం చుట్టినట్లు ఆ పార్టీలోని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

ఉమ్మడి జిల్లాలో ఐదారు స్థానాల్లో అభ్యర్థుల ఖరారు..

ప్రధాని సభ వరకు రాష్ట్రంలో 50 నుంచి 60 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటించనున్నట్లు వినికిడి. ఇందులో ఉమ్మడి పాలమూరుకు సంబంధించి దాదాపు ఐదారు స్థానాల్లో అభ్యర్థిత్వాలను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల పర్యటించారు. మే నెలలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన సభకు హాజరయ్యారు. వచ్చే నెల ఒకటిన నిర్వహించే సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానుండడం.. ఎం కేసీఆర్ సభ తర్వాత రెండు వారాల వ్యవధిలోనే బీజేపీ సభకు సమాయత్తం కావడం చర్చనీయాంశంగా మారింది. ప్రధాని మోదీ రానుండడంతో బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో మాత్రం జోష్ నెలకొంది.

'పాలమూరు' నుంచే శ్రీకారం

ఈ ఏడాది మార్చిలో జరిగిన మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో పోటీ చేసిన ఏవీఎన్ రెడ్డి విజయం సాధించిన విషయం తెలిసిందే. రాష్ట్ర, జాతీయస్థాయి నేతలు ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి.. ఆయన గెలుపు కోసం కృషి చేశారు. అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థిని ఓడించి.. ఏవీఎన్‌రెడ్డి విజయం సాధించిన క్రమంలో ఆ వ్యూహంపై అధిష్టానం పెద్దలు అప్పుడే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అదే వ్యూహాన్ని దక్షిణ తెలంగాణ వ్యాప్తంగా అమలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. డిసెంబరులో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ప్రధానితో పాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితర అగ్రనేతలతో సభలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా ముందుగా అక్టోబర్ 1న ఉదయం నిజామాబాద్ పార్లమెంట్‌తో పాటు మధ్యాహ్నం పాలమూరులో బహిరంగసభల నిర్వహణకు సమాయత్తమైంది. దీనికి సంబంధించి ఉమ్మడి జిల్లాకు చెందిన బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి ఏర్పాట్లలో తలమునకలయ్యారు. జితేందర్‌రెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు శనివారం మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్ సమీపంలోని మైదానాన్ని పరిశీలించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


చెన్నయ్య (ఫైల్)

ధరూరు: మండలంలోని జాంపల్లిలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. జాంపల్లికి చెందిన రైతు చెన్నయ్య (45) రోజు మాదిరిగానే శనివారం పత్తి, వరిపంటకు నీళ్లు పారించేందుకు పొలానికి వెళ్లాడు. వ్యవసాయ మోటారు స్టార్టర్ వద్ద కింద పడిన విద్యుత్ వైర్‌ను సరిచేస్తుండగా, షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పద్మ గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అందరిలో కలివిడిగా ఉండే చెన్నయ్య అకాల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..


నాగయ్య (ఫైల్)

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం రంగసముద్రం రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటస్వామి కథనం మేరకు.. పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డి.నాగయ్య (53) శుక్రవారం చేపల వేటకు వెళ్తున్నానని భార్యతో చెప్పి రంగసముద్రం రిజర్వాయర్‌కు వచ్చాడు. రాత్రి వర కు అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. శనివారం నాగరాల శివారులోని రంగసముద్రం ఒడ్డున అతడు శవమై కనిపించాడు. అతడి కాళ్ల కు వల్ల చుట్టుకొని మృతి చెందాడు. మృతుడి భార్య కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాల్వలో పడి మరొకరు..

ఎర్రవల్లిచౌరస్తా: కాల్వలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు వివరాల మేరకు.. మండలంలోని గోపల్‌దిన్నెకు చెందిన కుర్వ లక్ష్మన్న (60) భార్య కొంతకాలం కిందట మరణించింది. దీంతో మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో ఎర్రవల్లి సమీపంలోని కాల్వలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నమిత్తం గద్వాల మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి

నవాబుపేట: చికిత్స పొందుతున్న ఓ బాలుడు మృతిచెందినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని పోమాల్‌కు చెందిన కావలి చంటి(13) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదివేవాడు. ఈ నెల 20న జ్వరం రావడంతో తండ్రి కావలి ఆంజనేయులు గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్ద చూపించారు. 22న జ్వరం తీవ్రం కావడంతో జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వికటించి బాలుడు మృతి చెందాడని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పూర్వవైభవం వచ్చేనా..?

అలంపూర్ పుణ్యక్షేత్రాలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధిగాంచాయి. ఈ క్షేత్రానికి కాశీతో సమానంగా విశిష్టత ఉంది. కాశీలో ఉన్నట్టుగా ఇక్కడ కూడా 64 స్నాన ఘాట్లు ఉండటంతో దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచింది. అయితే ప్రస్తుతం కొన్ని ఘాట్లు శిథిలావస్థకు చేరగా.. మిగతావి కనుమరుగయ్యాయి. సందర్శకులు గుర్తించేందుకు కనీసం ఆయా ఘాట్ల పేర్లు తెలిపే సూచిక బోర్డులు సైతం లేకపోవడం విచారకరం. కర్నూలు జిల్లాలోని పంచలింగాల మొదలుకొని అలంపూర్ క్షేత్రానికి అతి సమీపంలోని గొందిమల్ల సంగమతీర్థం వరకు అంతరించిపోయిన ఘాట్లు, వాటి పేర్లు, విశిష్టతపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– జోగుళాంబ శక్తిపీఠం (అలంపూర్)

- దక్షిణకాశీలో అంతరించిపోతున్న 64 స్నానఘాట్లు
- కాశీ క్షేత్రం మాదిరిగా ఎన్నో పోలికలు


అలంపూర్‌లోని దేవద్రోణి స్నాన ఘాట్

సండే స్పెషల్

రాష్ట్రంలోనే ఏకైక శక్తిపీఠంగా, శ్రీశైల మహాక్షేత్రానికి పశ్చిమ ద్వారంగా విరాజిల్లుతున్న అలంపూర్ పుణ్యక్షేత్రం కాశీతో సమానమైన క్షేత్రంగా స్కంధపురాణంలో పేర్కొన్నారు. కాశీలోని పోలికలన్నీ ఇక్కడి క్షేత్రంలో కనిపిస్తుండటంతో ఈ క్షేత్రానికి దక్షిణకాశీ అని పేరు వచ్చింది. కాశీ క్షేత్రంలో ఉన్నట్టుగా అలంపూర్ క్షేత్రంలో కూడా 64 స్నాన ఘాట్లు ఉండటాన్ని గమనించి అప్పట్లో ఈ క్షేత్రాన్ని దక్షిణకాశీగా గుర్తిస్తూ స్కంధపురాణంలోని శ్రీశైల ఖండలంలో గల సనతకుమార సంహిదంలో చెప్పారు. కాగా ప్రస్తుతం ఈ 64 స్నాన ఘాట్లు పూర్తిగా కనుమరుగై పోయాయి. అక్కడక్కడ శిథిలావస్థకు చేరిన కొన్ని ఘాట్లు కనిపించినప్పటికీ చాలా వరకు ఆనవాళ్లు కూడా కనిపించవు. కర్నూలుకు ఆనుకుని ఉన్న పంచలింగాల ఘాట్ నుంచి అలంపూర్‌కు అతి దగ్గరలోని కృష్ణ– తుంగభద్ర సంగమ స్థానమైన గొందిమల్ల శివారు దాకా ఉన్న 64 స్నాన ఘాట్ల పేర్లు సైతం తెలియని పరిస్థితి నెలకొంది. కనుమరుగైన ఈ 64 పూర్వపు స్నాన ఘాట్లను పునరుద్ధరిస్తే.. క్షేత్రం పూర్వవైభవం సంతరించుకోవడం, తద్వారా సందర్శకుల తాకిడి మొదలై.. చిరు వ్యాపారులకు జీవనోపాధి పెరగడమే కాక.. ఈ ప్రాంత ఆర్థిక పరిస్థితులు సైతం మెరుగవుతాయి.


స్నాన ఘాట్ తీరాన నవబ్రహ్మ ఆలయాలు

ఇదీ వైశిష్ట్యం

పూర్వం నదీతీరాల్లో సహజ సిద్ధంగా పెరిగిన ఔషధ మూలికలతోపాటు పూర్వం ఎంతోమంది యోగులు, మహా మునులు, రుషీశ్వరులు ఈ నదుల దగ్గర స్నాన సంసద్యానుష్టానాలు ఆచరిస్తూ అక్కడ వారు నివాసం ఉండేవారు. అలా నివాసం ఉన్న ఆయా మునులు, సాదు సజ్జనులు అలాగే ఔషధీ సంవస్కారం కలిగిన అనేక మూలికలు ఇతరత్రా ప్రాధాన్యత సంతరించుకున్న వాటి పేర్లతో ఈ 64 స్నాన ఘాట్లకు ఆయా పేర్లు వచ్చాయని చెబుతారు. ఇలా 64 స్నాన ఘాట్లలో పుణ్యస్నానాలు ఆచరించడం ద్వారా శరీర రుగ్మతలు పోవడమే కాక 'గంగాస్నానం– తుంగాపానం' అన్నట్టుగా విశేష ఫలితం కలుగుతుందని చెబుతారు.


జలలింగేశ్వర ఘాట్

ఘాట్ల పేర్లు ఇవే..

1. పంచలింగాల, 2. దక్షిణేశ్వరం, 3. ఆది సిద్ధేశ్వరం, 4. మయూరేశ్వరం, 5. పంచరామేశ్వరం, 6. అగస్త్యేశ్వరం, 7. జనార్ధనేశ్వరం, 8. అంతర గంగ, 9. పాపనాశిని, 10. ప్రథమ బ్రహ్మతీర్థం, 11. ఛాయ మల్లికార్జునం, 12. వేదసంగమం, 13. గణిక సిద్ధేశ్వరం, 14. మోక్షేశ్వరం, 15. భుజంగేశ్వరం, 16. బింధుమాదవం, 17. బ్రహ్మ నారాయణం, 18. రుద్రపాదం, 19. మణికర్ణిక, 20. ధర్మేశ్వరం, 21. కుకుటేశ్వరం, 22. రాజరామేశ్వరం, 23. సర్పకోటీశ్వరం, 24. సకలేశ్వరం, 25. ప్రయాగమాదవం, 26. అనలేశ్వరం, 27. జలలింగేశ్వరం, 28. లకులీశ్వరం, 29. నాగేశ్వరం, 30. కపోతేశ్వరం, 31. కర్ణేశ్వరం, 32. బ్రహ్మేశ్వరం, 33. ఇంద్రేశ్వరం, 34. వ్యాసేశ్వరం, 35. నారదేశ్వరం, 36. చండీకేశవం, 37. పరుషేరామేశ్వరం, 38. రామేశ్వరం, 39. అగ్నేశ్వరం, 40. మహాలక్ష్మేశ్వరం, 41. పాతాలేశ్వరం, 42. మార్కండయేశ్వరం, 43. దేవద్రోణి, 44. నాగద్రోణి, 45. సాక్షేశ్వరం, 46. సిద్ధేశ్వరం, 47. త్రిపురాంతకం, 48. వారణేశ్వరం, 49. హట సిద్ధేశ్వరం, 50. వారాహ,


శిథిలావస్థలో దేవద్రోణి తీర్థం ఘాట్

51. బలభద్రేశ్వరం, 52. కమలేశ్వరం, 53. యాగేశ్వరం, 54. శుక్రేశ్వరం, 55. నాగభోగేశ్వరం, 56. సోమ సిద్ధేశ్వరం, 57. నాగసంగమం, 58. కలకలేశ్వరం, 59. అశ్వమేధేశ్వరం, 60. దవళేశ్వరం, 61. ఏలేశ్వరం, 62. కంఠేశ్వరం, 63. భస్మేశ్వరం, 64 సంగమేశ్వరం. ఇలా 64 స్నాన ఘాట్ల పేర్లను నేటి ప్రపంచానికి, ఇక్కడికి వచ్చే భక్తులకు తెలియజేసే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పునరుద్ధరించాలి..



కాశీతో సమానమైన అలంపురం పుణ్యక్షేత్రానికి పూర్వం ఉన్న 64 స్నానఘాట్లను పునరుద్ధరించాలి. ఇలా చేయడం ద్వారా ఈ క్షేత్రానికి మరింత యాత్రికులు పెరుగుతారు. తద్వారా ఎంతో మందికి పరోక్షంగా జీవనోపాధి కలుగుతుంది. ఇందులో 19వ ఘాట్ మణికర్ణిక, 44వ ఘాట్ నాగద్రోణిల అభివృద్ధికి జోగుళాంబ సేవాసమితి కృషిచేస్తుంది. – శ్రీనివాస్, జోగుళాంబ సేవాసమితి అధ్యక్షుడు

త్వరలోనే గుర్తిస్తాం..



కాశీతో సమానమైన 64 స్నాన ఘాట్లు ఈ ప్రాంతంలో ఉండటం వల్ల మరింత ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. 64 స్నాన ఘాట్ల పేర్లు 'సాక్షి' దినపత్రిక వెలుగులోకి తీసుకురావడం అభినందనీయం. పాలక మండలితో కలిసి ఈ ఘాట్లను త్వరలోనే గుర్తించి అక్కడ ఆయా పేర్లతో సూచిక బోర్డులను ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తాం. – పురేందర్‌కుమార్, ఈఓ, అలంపూర్

పేర్లలోనే భక్తిభావన



ఇప్పటి వరకు 64 స్నాన ఘాట్ల పేర్లు ఎవరికీ తెలియదు. 'సాక్షి' దినపత్రిక ఈ 64 స్నాన ఘాట్ల పేర్లు వెలుగులోకి తీసుకురావడం అభినందనీయం. ఈ పేర్లు వింటుంటేనే ఒక భక్తిబావన కలుగుతుంది. ఈ పేర్లకు చక్కని ప్రాచుర్యంతోపాటు భక్తులు ఆయా ఘాట్లను సందర్శించే విధంగా తదపరి చర్యలు తీసుకుంటాం. – చిన్నకృష్ణయ్య, ఆలయ కమిటీ చైర్మన్, అలంపూర్

ప్రసాద్ స్కీంలో..



పుణ్యక్షేత్రాల్లోని స్నాన ఘాట్లకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. అలాంటిది శాస్త్ర ప్రమాణికంగా ఉన్న ఈ 64 స్నాన ఘాట్లు పునరుద్ధరించబడితే ఈ క్షేత్రం, ఈ ప్రాంతం మరింత పునీతమవుతాయి. భవిష్యత్‌లో ప్రదోశ కాలంలో ఈ 64 స్నాన ఘాట్లలో ఏక కాలంలో నదీ హారతులు జరిగితే చూడటానికి రెండు కళ్లు సరిపోవు. ప్రసాద్ స్కీం ద్వారా స్నాన ఘాట్లను పునరుద్ధరించాలి. – ఆనంద్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు, అలంపూర్

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి


విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న జడ్జి సంధ్యారాణి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి

అడ్డాకుల: విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుతారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. మూసాపేట మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ వద్ద రిటైర్డ్ ఉపాధ్యాయుడు నామాల బాలయ్య వర్ధంతిలో ఆమె పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులో జడ్జి సంధ్యారాణి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు భక్తి, క్రమశిక్షణ, యోగా అవసరమన్నారు. చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. భవిష్యత్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే జరిగే నష్టం గురించి తెలిస్తే వాటికి దూరంగా ఉంటారన్నారు. అనంతరం నామాల బాలయ్య జయంతి సందర్భంగా రిటైర్డ్ డిప్యుటీ కలెక్టర్ ఎరుకలి బాలయ్య ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎస్‌ఐ కె.శ్రీనివాసులు, న్యాయవాదులు రఘుపతి, రవికుమార్, ఎంఈఓ రాజేశ్వర్ రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎరుకలి బాలయ్య, వలంటీర్ తిరుమలేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ తిరుపతయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉత్సాహంగా ఎండీసీఏ లీగ్

మహబూబ్‌నగర్ క్రీడలు: పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానంలో ఎండీసీఏ లీగ్ కొనసాగుతోంది. శనివారం జరిగిన తొలి లీగ్ మ్యా చ్‌లో పర్పుల్ జట్టు 36 పరుగుల తేడాతో బ్రౌన్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పర్పుల్ జట్టు 23.3 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో చరణ్ 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన బ్రౌన్ జట్టు 22.1ఓవర్లలో 101 పరుగులకు ఆలౌట్ అ యింది. మరో లీగ్ మ్యాచ్‌లో ఎల్లో జట్టు 3వికెట్ల తేడాతో పింక్ జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన పింక్ జట్టు 14 ఓవర్లలో 64పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎల్లో జట్టు 14ఓవర్లలో 7వికెట్లకు 65పరుగులు చేసింది.

అధిక సాంద్రతతో పంటకాలం కుదింపు



బిజినేపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పత్తిలో అధిక సాంద్రత పద్ధతి పాటించడం వల్ల పంట త్వరగా చేతికొస్తుందని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకుడు పి.రఘురాంరెడ్డి అన్నారు. శనివారం పాలెం కేవీకే ఆధ్వర్యంలో అధిక సాంద్రతలో పత్తిసాగు యాజమాన్యపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిలో మొక్కల శాతం పెంచడం వల్ల పంటకాలం తగ్గుతుందన్నారు. పత్తిపంట త్వరగా చేతికి రావడం వల్ల మరో స్వల్పకాల పంటను సాగు చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ మల్లారెడ్డి మాట్లాడుతూ దక్షిణ తెలంగాణలో తేలికపాటి భూములు ఉండటం వల్ల రైతులందరూ అధిక సాంద్రతలో పత్తిసాగు చేపట్టాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త వీరన్న, పాలెం కేవీకే సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి, డీఏవో వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు ఓంప్రకాష్, అశ్విని, వాణిశ్రీ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం: ప్రేమించిన యువకుడు మోసం చేశాడంటూ ఓ యువతి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన శనివారం జిల్లాకేంద్రంలోని విద్యుత్ కార్యాలయ ఆవరణలో చోటు చేసుకుంది. ప్రత్యక్షులు, బాధితురాలి కథనం మేరకు.. జిల్లాకు చెందిన ఓ యువతి బీటెక్ చదివే సమయంలో ఇటిక్యాల మండలానికి చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడటంతో ఆ యువతి పెళ్లి విషయాన్ని అతడి వద్ద ప్రస్తావించింది. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తర్వాత పెద్దలను ఒప్పించి వివాహం చేసుకుందామని నచ్చజెప్పారు. సదరు యువకుడికి ఇటీవల విద్యుత్‌శాఖలో ఏఈ కొలువు రావడంతో గద్వాలలోని నదీఅగ్రహారం సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వరిస్తున్నారు. శనివారం యువతి అక్కడికి చేరుకొని పెళ్లి ప్రస్తావన తీసుకురాగా మరొకరితో వివాహం నిశ్చయమైందని.. మర్చిపోవాలని తేల్చి చెప్పడంతో మనస్థాపానికి గురైన యువతి వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుంది. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే నిలువరించి నీరుపోసి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు యువతిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని పట్టణ రెండో ఎస్‌ఐ అబ్దుల్ షుకూర్ వద్ద ప్రస్తావించగా యువతి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

శివాలయంలో చోరీ



కోడేరు: మండల కేంద్రంలోని ఉమామహేశ్వర ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఆలయ పూజారి శివయ్య, కమిటీ సభ్యుల కథనం ప్రకారం.. ఉమామహేశ్వరస్వామి ఆలయంలో రోజువారిగా అర్చకులు పూజలు ముగించుకొని తాళం వేసి వెళ్లారు. సాయంత్రం ఆలయానికి వచ్చి చూస్తే ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగులగొట్టి ఉంది. ఆలయంలో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆలయంలో ప్రధాన ద్వారం అమ్మవారు, కృష్ణుడి గర్భగుడి మొత్తం నాలుగు ద్వారాలకు ఉన్న తాళాలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి మాంగళ్యంతోపాటు తీర్థం గిన్నె, గంటను దొంగిలించారని, వీటి విలువ రూ.40 వేలు ఉంటుందని చెప్పారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని.. క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కప్పేసిన గుర్రపు డెక్క, జమ్ము!


బండ్లగేరి వద్ద ఎర్రకుంటను కప్పేసిన గుర్రపు డెక్క, జమ్ము

- పట్టణంలోని చెరువులు, కుంటల్లో కలుస్తున్న మురుగు
- పెద్దచెరువు చుట్టూ వరద కాల్వలలోనూ అదే పరిస్థితి
- భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థతోనే పరిష్కారమంటున్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని వివిధ చెరువులు, కుంటలను గుర్రపు డెక్క, జమ్ము ఎక్కడికక్కడ కప్పేస్తున్నాయి. ఇక పెద్దచెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వరద కాల్వల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీనికి ప్రధాన కారణం వీటిలో మురుగు కలుస్తుండటమేనని మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు పది చెరువులు, కుంటలు ఉన్నాయి. వార్డు నం.6 పరిధి (శ్రీనివాస కాలనీ) లోని ఊరగుట్ట–పెద్దచెరువు 85 ఎకరాలలో, వార్డు నం.28 (బండ్లగేరి, కురిహినిశెట్టి కాలనీ శివారు) లోని ఎర్రకుంట 23 ఎకరాలలో, వార్డు నం.13 (బండమీదిపల్లి) లోని ఇమాంసాబ్ కుంట 20 ఎకరాలలో, వార్డు నం.9 (పాలకొండ) లోని ఊరకుంట పదెకరాలలో, వార్డు నం.2 (ఎనుగొండ) లోని మోదంకుంట, మెర్రిజెరికుంటలు తొమ్మిది ఎకరాలలో, వార్డు నం.5 (ఎస్‌వీఎస్ పక్కన) లోని మంగలికుంట ఐదెకరాలలో, వార్డు నం.1 (తిమ్మసానిపల్లి) లోని పోసోనికుంట మూడెకరాలలో విస్తరించి ఉన్నాయి. ఇక పట్టణం నడిబొడ్డున సుమారు 120 ఎకరాలలో పెద్దచెరువు ఉండగా రెండేళ్ల నుంచి అక్కడ సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. దీనిని మినీ ట్యాంక్ బండ్‌గా మార్చి.. బోటింగ్ సౌకర్యంతో పాటు ఐలాండ్, కేబుల్ సస్పెన్షన్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తున్నారు.


జిల్లా ప్రధాన స్టేడియం వెనుక భాగంలోని వరద కాల్వలో పెరిగిన గుర్రపు డెక్క, జమ్మును తొలగిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

మురుగు కలుస్తుండటంతో..

వీటిలోని ఎర్రకుంట, ఊరగుట్ట–పాలకొండ పెద్దచెరువు, ఇమాంసాబ్‌కుంటలు సగానికి పైగా గుర్రపుడెక్క, జమ్ముతో నిండిపోయాయి. అలాగే పెద్దచెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వరద కాల్వలలోనూ ఏపుగా పెరిగాయి. ముఖ్యంగా పట్టణంలో అన్ని చోట్ల ఓపెన్ నాలాలు మాత్రమే ఉండటంతో మురుగు మొత్తం ఈ చెరువులు, కుంటలలోనే కలుస్తోంది. దీనివల్ల గుర్రపుడెక్క, జమ్ము ఎప్పటికప్పుడు ఏపుగా పెరిగిపోతోంది. ఒకప్పుడు పెద్దచెరువులో వీటిని తొలగించడానికి ఏటా మున్సిపాలిటీ నుంచి రూ.లక్షల్లో వెచ్చించేవారు. ప్రస్తుతం దీని చుట్టూ ఉన్న వరద కాల్వలలో పారిశుద్ధ్య కార్మికులతో తొలగిస్తున్నా ఆశించిన ప్రయోజనం దక్కడం లేదు. మిగతా చెరువులు, కుంటల్లో గుర్రపుడెక్క, జమ్ము తొలగింపునకు ఇటు మున్సిపల్ అధికారులు గాని, అటు నీటిపారుదలశాఖ అధికారులు గాని ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఈ సమస్యను శాశ్వతంగా నిర్మూలించాలంటే భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ (అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ–యూజీడీ) తప్పనిసరి అని వారు పేర్కొంటున్నారు. అప్పుడే మురుగును మళ్లించి శుద్ధి చేయడం సాధ్యమవుతుందని చెబుతున్నారు. దీనికోసం గత మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం రూ.276 కోట్లు మంజూరు చేసినా ఇప్పటికీ టెండర్ల దశను దాటలేదు. ఇంతకు ఈ పనులన్నీ ఎప్పుడు చేపట్టి.. ఎప్పుడు పూర్తి చేస్తారోనని పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్నారు.

యూజీడీతోనే శాశ్వత పరిష్కారం

పట్టణ పరిధిలోని వివిధ చెరువులు, కుంటలలో మురుగు కలుస్తున్నందున గుర్రపుడెక్క, జమ్ము ఏపుగా పెరుగుతోంది. వీటి నిర్మూలనకు యూజీడీ ద్వారానే శాశ్వతంగా పరిష్కరించవచ్చు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఈపాటికే నిధులు కేటాయించింది. త్వరలోనే టెండర్లను పిలిచి పనులు చేపట్టే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

– మనోహర్, డీఈఈ, నీటిపారుదల శాఖ, మహబూబ్‌నగర్

క్లుప్తంగా...

ఏపీలో 'ఇంగ్లిష్' విద్యావిధానం భేష్

సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి



ఖమ్మంగాంధీచౌక్: ఆంధ్రప్రదేశ్‌లో ఇంగ్లిష్ విద్యకు అక్కడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని సినీనటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అభినందించారు. శనివారం ఖమ్మం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీలో ఇంగ్లిష్ మీడియం అమలును ప్రశంసించారు. ఇదే తరహా విధానాన్ని దేశవ్యాప్తంగా కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మాతృభాష తెలుగు అయినా.. మనుగడ భాష ఇంగ్లిష్ అన్నారు. మన జీతం, జీవితం ఇంగ్లిష్‌తోనే ముడిపడి ఉంటుందన్నారు. గ్రామం మొదలు ప్రపంచం వరకు గ్లోబలైజేషన్ అయిననేపథ్యంలో అందరూ ఆంగ్లం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య ద్వారా సామాజిక న్యాయం దక్కుతుందని, ఇంగ్లిష్ విద్య శక్తి మంతమైందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారని తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీలు మహిళా బిల్లులో ఎందుకు పాల్గొనలేదు?

తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్ సాగర్

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశ సమయంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు పాల్గొనలేదో సమాధానం చెప్పాలని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ నిలదీశారు. మహిళలను కాంగ్రెస్ పార్టీ చులకనభావంతో చూస్తుందని శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ కోసం ప్రధానమంత్రికి తెలంగాణ సీఎం కేసీఆర్ లేఖ రాశారని, దేశంలోని అన్ని పార్టీలకు ఎమ్మెల్సీ కవిత లేఖలు రాసి మద్దతు కూడగట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం బిల్లు పార్లమెంట్‌లో ఓటింగ్‌కు వచ్చినప్పుడు ఓటు వేయకుండా దొడ్డిదారిలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు బయటకు వచ్చారన్నారు.

బీజేపీ ఎంపీ రమేశ్ బిధూడీని అనర్హుడిగా ప్రకటించాలి: బీఎస్పీ

సాక్షి, హైదరాబాద్: బీఎస్పీ ఎంపీ కున్వర్ డానిష్ అలీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ రమేశ్ బిధూడీని వెంటనే లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించాలని తెలంగాణ బీఎస్పీ డిమాండ్ చేసింది. బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సాంబశివగౌడ్, అరుణ, మైనారిటీ విభాగం కన్వీనర్లు అబ్రార్ హుస్సేన్ ఆజాద్, మౌలానా షఫీ మసూది పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు.

అంతా కనికట్టు

మఖిలో పుట్టి పుబ్బలో మాయమైన డొల్ల కంపెనీలు

- కేవలం స్కిల్ స్కాం డబ్బులు తరలించడానికే ఏర్పాటు
- స్కిల్ ఒప్పందం కుదిరిన నాలుగు రోజుల్లోనే రూ.లక్ష మూల ధనంతో పీవీఎస్‌పీ–స్కిలర్ కంపెనీ ఏర్పాటు
- ఆర్వోసీ బ్యాలెన్స్ షీట్లలో బయటపడ్డ స్కిలర్ బాగోతం
- ఏ అనుభవం లేని ఆ కంపెనీకి రూ.241.49 కోట్లు బదిలీ
- విలువైన పరికరాలు సరఫరా చేసినట్లు దొంగ ఇన్వాయిస్‌ల సృష్టి
- 2014లో ఏర్పాటైన ఇన్‌వెబ్, పాట్రిక్ ఇన్ఫో, భారతీయ గ్లోబల్ కంపెనీలు 2018 తర్వాత మూత
- ఆర్వోసీలో నమోదు కాని కంపెనీల పేరిటా బిల్లులు చెల్లింపు




సాక్షి, అమరావతి: నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ పేరుతో డబ్బులు కొట్టేయడానికి టీడీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పక్కా ప్రణాళికతో అడుగులు వేశారు. స్కిల్ సెంటర్స్ పేరుతో డొల్ల కంపెనీల ద్వారా డబ్బు ఎలా తరలించాలో ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకున్న తర్వాతే ఏపీఎస్ఎస్‌డీసీని తెరపైకి తెచ్చి.. సీమెన్స్ ముసుగులో ఒప్పందం చేసుకున్నారు. ఎటువంటి పరికరాలు సరఫరా చేయకుండానే చేసినట్లు దొంగ ఇన్వాయిస్‌లను సృష్టించి రూ.241 కోట్లు కాజేశారు. ఈ బాగోతమంతా ఎన్‌ఫోర్స్‌మెంట్, జీఎస్టీ ఇంటెలిజెన్స్, సెబీ, ఫోరెన్సిక్ ఆడిట్స్‌లో పక్కా ఆధారాలతో బయటపడింది. ఇందుకోసం అప్పటికప్పుడు కొన్ని షెల్ కంపెనీలను పుట్టించగా, హవాలా మార్గంలో నగదును సరఫరా చేసే కొన్ని షెల్ కంపెనీలను ఎంచుకున్నారు. మొత్తం ఈ కుంభకోణంలో సీమెన్స్ ముసుగులో డిజైన్‌టెక్ కీలకంగా వ్యవహరించింది. డిజైన్ టెక్ నుంచి రెండు షెల్ కంపెనీలకు మొత్తం నగదును పంపించి, అక్కడ నుంచి అనేక షెల్ కంపెనీల ద్వారా తిరిగి ఆ నగదు చంద్రబాబు సూచించిన వ్యక్తులకు చేరినట్లు దర్యాప్తులో షెల్ కంపెనీల ప్రతినిధులు అంగీకరించారు.

రూ. లక్షతో రూ. 241 కోట్లు

నగదును తరలించడం కోసం స్కిలర్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (గతంలో పీవీఎస్‌పీ ఐటీ స్కిల్స్ ప్రాజెక్ట్‌గా పిలిచేవారు) పేరుతో ఒక డొల్ల కంపెనీని అప్పటికప్పుడు ఏర్పాటు చేశారు. ఏపీఎస్ఎస్‌డీసీతో ఒప్పందం కుదిరిన కొద్ది రోజులకే 2015 మార్చి30న స్కిలర్ కంపెనీని ఏర్పాటు చేసినట్లు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్వోసీ) డేటా స్పష్టం చేస్తోంది. న్యూఢిల్లీ కేంద్రంగా ప్రతిక్ రమన్‌భాయ్ పటేల్, అబ్దుల్ రఫుల్ హాయ్ కేవలం లక్ష రూపాయల మూల ధనంతో స్కిలర్ ఎంటర్‌ప్రైజెస్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ఎటువంటి అనుభవం లేని ఈ కంపెనీకి ఏకంగా రూ.241.49 కోట్ల విలువైన హార్డ్‌వేర్ పరికరాలను సరఫరా చేసే కాంట్రాక్టును అప్పగించారు. 717 దొంగ ఇన్వాయిస్‌లను సృష్టించి వాటి ద్వారా డబ్బులు కొట్టేశారు. స్కిలర్ కంపెనీ 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఈ స్కిల్ ల్యాబ్స్‌కు రూ.241.49 కోట్ల విలువైన హార్డ్‌వేర్ పరికరాలను సరఫరా చేసి డబ్బులు తీసుకున్నట్లు దొంగ రికార్డులు సృష్టించారు. కానీ ఆ వివరాలను ఎక్కడా ఆ కంపెనీ అకౌంట్స్‌లో చూపించలేదు. 2016–17 సంవత్సరానికి స్కిలర్ కంపెనీ ఆర్వోసీకి సమర్పించిన ఆర్థిక స్టేట్‌మెంట్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఆ సంవత్సరంలో కేవలం రూ.99.03 కోట్ల విలువైన పరికరాలు మాత్రమే సరఫరా చేసినట్లు దొంగ లెక్కలు చూపించారు. వాస్తవానికి ఒక్క రూపాయి విలువైన పరికరాలు కూడా సరఫరా చేయలేదు. స్కిల్ కుంభకోణంపై సీఐడీ విచారణ ప్రారంభించిన తర్వాత స్కిలర్ తన దుకాణం మూసేసినట్లు ఆర్వోసీ రికార్డులు సూచిస్తున్నాయి. 2021లో చివరిసారిగా బ్యాలెన్స్ షీట్లు సమర్పించిన స్కిలర్ గత రెండేళ్ల నుంచి ఎటువంటి సమాచారాన్ని ఆర్వోసీకి ఇవ్వడం లేదు.

డబ్బులు వచ్చాక దుకాణం బంద్

స్కిలర్ చేతికి వచ్చిన రూ.241.49 కోట్లను పాట్రిక్ ఇన్ఫో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్‌వెబ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా లిమిటెడ్, ఐటీ స్మిత్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి అనేక డొల్ల కంపెనీల ద్వారా చంద్రబాబు గూటికి తరలించేశారు. ఈ కంపెనీలు కేవలం స్కిల్ కుంభకోణం సమయంలో మాత్రమే కార్యకలాపాలు నిర్వహించాయని, ఆ తర్వాత పని చేయలేదని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. రూ.లక్ష మూలధనంతో 2012లో న్యూఢిల్లీ కేంద్రంగా ఏర్పాటైన ఇన్‌వెబ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డొల్ల కంపెనీని 2016లో నగదు తరలించిన తర్వాత మూసేశారు. 2016లో చివరిసారిగా బ్యాలెన్స్ షీట్ సమర్పించిన ఈ కంపెనీ ఆ తర్వాత నుంచి ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదని, ప్రస్తుతం ఇది మూతపడిన కంపెనీగా ఆర్వోసీ రికార్డుల్లో పేర్కొన్నారు. మరో డొల్ల కంపెనీ పాట్రిక్ ఇన్ఫో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా న్యూఢిల్లీ కేంద్రంగా రూ.లక్షతో మొదలైంది. స్కిల్ కుంభకోణం నిధుల తరలింపు పూర్తయిన తర్వాత 2018లో ఈ కంపెనీ మూతపడింది. 2018 తర్వాత ఈ కంపెనీ ఎటువంటి బ్యాలెన్స్ షీట్లను సమర్పించలేదని, ప్రస్తుతం ఈ కంపెనీ మూసివేసిన కంపెనీగా ఆర్వోసీ రికార్డుల్లో చూపిస్తోంది. రూ.లక్షతో న్యూఢిల్లీ కేంద్రంగా ప్రారంభమైన భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా లిమిటెడ్ 2018 డిసెంబర్ 10 తర్వాత నుంచి ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదని ఆర్వోసీ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అంటే ఈ డొల్ల కంపెనీలన్నీ నగదు తరలించాక కనుమరుగయ్యాయని స్పష్టమవుతోంది. ఇలా దొంగ ఇన్వాయిస్‌లతో నగదును తరలించడమే కాకుండా, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కోరుతూ దరఖాస్తు చేయడంతో పుణేలోని జీఎస్టీ ఇంటెలిజెన్స్ రంగంలోకి దిగి తీగ లాగితే మొత్తం డొంకంతా బయట పడింది.



2018 తర్వాత నుంచి భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా లిమిటెడ్‌లో ఎటువంటి కార్యకలాపాలు జరగడం లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తున్న ఆర్వోసీ రికార్డులు

హవాలా నగదు తరలింపులో ఏసీఐ దిట్ట

అల్లైయిడ్ కంప్యూటర్స్ ఇంటర్నేషనల్ (ఆసియా) లిమిటెడ్ (ఏసీఐ) నకిలీ ఇన్వాయిస్‌లతో నగదును తరలించడంలో దిట్ట. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన ఈ కంపెనీకి ఈ విషయంలో పెద్ద రికార్డే ఉంది. 2013–14 నుంచి 2019–20 వరకు ఈ కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌ను పరిశీలిస్తే స్కిల్ కుభంకోణం సమయంలో ఏసీఐ ద్వారా ఎంత నగదు తరలించారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కుంభకోణం ముందు, తర్వాత ఏడాదికి రూ.లక్షల్లో మాత్రమే ఆదాయాన్ని చూపిన ఈ కంపెనీ.. కుంభకోణం సమయంలో రూ. కోట్లల్లో ఆదాయం చూపించడం గమనార్హం. ఒప్పందం కుదిరిన మొదటి సంవత్సరం అంటే 2015–16లో రూ.30.52 కోట్లు, 2016–17లో రూ.35.77 కోట్లు, 2018–19లో రూ.9.77 కోట్లు ఆదాయాన్ని చూపించిన ఈ కంపెనీ 2019–20కి వచ్చే సరికి కేవలం రూ.2 లక్షల ఆదాయాన్ని మాత్రమే చూపించింది. ఈ కంపెనీ లావాదేవీలపై అనుమానం వచ్చిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా 2017లో రంగంలోకి దిగి విచారణ ప్రారంభించింది. ఈ విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా సెబీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ వారికి సమాచారమిస్తే వారు ఆయా కంపెనీలకు నోటీసులు జారీ చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్ సందర్భంగా కంపెనీకి, కంపెనీ డైరెక్టర్లకు నోటీసులు జారీ చేయగా, వారు నిజాలను ఒప్పేసుకున్నారు. ఎటువంటి వస్తువులు సరఫరా చేయకుండానే చేసినట్లు ఇన్వాయిస్‌లు సృష్టించి డిజైన్ టెక్ నుంచి నగదును తీసుకొని వాటిని వివిధ రూపాల్లో తిరిగి వారికే ఇచ్చినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ఏసీఐ ఎండీ స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేశారు. వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు పేరుతో రూ.241 కోట్లు డొల్ల కంపెనీల ద్వారా కొట్టేస్తూ సాక్ష్యాలతో బయటపడినా టీడీపీ మీడియా మా బాబు నిప్పు అంటూ అడ్డగోలుగా వాదనలు చేయడం వారికే చెల్లింది.

విశాఖ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- ఏపీ సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి వెల్లడి
- నీతి ఆయోగ్ గ్రోత్ హబ్స్ జాబితాలో వైజాగ్‌కు చోటు



సాక్షి, విశాఖపట్నం: నీతి ఆయోగ్ గ్రోత్ హబ్స్ జాబితాలో విశాఖపట్నం ఎంపికైన నేపథ్యంలో అభివృద్ధికి అవసరమైన భవిష్యత్ ప్రణాళికల్ని రూపొందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, టూరిజం ఆర్‌డీ శ్రీనివాస్ పాణి, మెట్రోరైల్ ఎండీ యూజేఎం రావు తదితరులతో మాట్లాడారు. విభాగాల వారీగా విశాఖలో చేపట్టనున్న ప్రాజెక్టులు, ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రాజెక్టుల స్థితిగతుల్ని అడిగి తెలుసుకున్నారు. విశాఖ అభివృద్ధికి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, బహుళ ప్రాజెక్టులతో విశాఖ రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో చేపట్టనున్న ప్రాజెక్టుల గురించి, మెట్రో రైలు కారిడార్ గురించి పీపీటీ ద్వారా జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లు వివరించారు. మెట్రో రైలు ప్రాజెక్టు నాలుగు విభాగాలుగా రూపొందుతోందని మెట్రో ఎండీ యూజేఎంరావు తెలిపారు. మొదటి విభాగంలో స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు, రెండోది గురుద్వార జంక్షన్ నుంచి పోస్టాఫీస్ వరకు, మూడోది తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేర్ వరకు, నాలుగోది కొమ్మాది నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 76.90 కి.మీ. మేర వేస్తున్నట్లు చెప్పారు. లైట్ కారిడార్, మోడరన్ కారిడార్ పేర్లతో రూపొందుతున్న మెట్రో రైలు ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని జవహర్‌రెడ్డి సూచించారు. అనంతరం జవహర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అర్బన్ గ్రోత్ హబ్ సిటీస్ జాబితాలో విశాఖ చోటు దక్కించుకోవడం గర్వకారణమన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా వెలుగొందాలంటే అర్బన్ సిటీస్ గ్రోత్ సెంటర్స్ ముఖ్యమని నీతి ఆయోగ్ గుర్తించిందని తెలిపారు. ఇందుకోసం నీతి ఆయోగ్ బృందం టోక్యో, న్యూయార్క్ వంటి 20 ప్రపంచస్థాయి నగరాల్ని అధ్యయనం చేసి రోడ్ మ్యాప్ సిద్ధం చేసిందని, ఇందులో భాగంగా విశాఖని ఎంపిక చేసిందని వివరించారు. విశాఖ నుంచి ముఖ్యమంత్రి పరిపాలనపై త్వరలోనే సమీక్ష నిర్వహిస్తామని సీఎస్ చెప్పారు.

జూరాలలో 8.338 టీఎంసీల నీటి నిల్వ

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి శనివారం 1,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 113 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,689 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.338 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

శ్రీశైలం @ 853.5 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 853.5 అడుగుల వద్ద 87.8605 టిఎంసీల నీటినిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 2,063, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,887, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 1.158 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి.. 2,187 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 62 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాడులో 1,891 క్యూసెక్కులు వినియోగం



మదనాపురం: రామన్‌పాడు జలాశయం నుంచి శనివారం 1,891 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం 1,030 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030, సమాంతర కాల్వతో 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్‌టీఆర్ కాల్వతో వ్యవసాయ అవసరాల కోసం వెయ్యి, కుడి కాల్వకు 10, ఎడమ కాల్వకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్–2 నుంచి 851 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

రెండో రోజూ అదే జోరు

- కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్ల ఆందోళన



తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ13 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో రోజు శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో టీచర్లు, ఆయాలు రోడ్డెక్కి ధర్నా చేశారు. టీచర్లంతా చౌరస్తాలో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వారు తమ నిరసనను వ్యక్తం చేశారు. వారికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు మద్దతుగా ప్రకటించారు. సీఐటీయూ సీనియర్ నాయకుడు కిల్లె గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజ, యూనియన్ కార్యదర్శి పుష్పలత, నాయకులు వర్ధగాలన్న, సత్తయ్య, రాజ్‌కుమార్, కృష్ణయ్య, ప్రశాంత్, భరత్, టీచర్లు కళావతి, నీలావతి, విజయలక్ష్మి, కమల, లక్ష్మి, రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, సత్యమ్మ, పద్మ, గౌసియాబేగం, మహిముద, సుగుణ, సువర్ణ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయ హుండీని శనివారం లెక్కించారు. మొత్తం రూ. 5,92,810 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. లెక్కింపులో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సభ్యులు సన్నాయిల నాగరాజు, ఎస్.శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీసీ అభినందన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విద్యార్థులను వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అభినందిచారు. ఈ మేరకు ఇక్కడ డిపార్ట్‌మెంట్‌లోనే 14 మంది విద్యార్థులు రూ.లక్షల్లో వేతనం వచ్చే సంస్థల్లో చేరడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం వల్ల చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాల్లో చేరడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, హెచ్‌ఓడీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 క్రీడల ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపికలను ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి బి.పాపిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 9.30 గంటలకు జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అండర్–19 బాల, బాలికల హ్యాండ్‌బాల్ ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఇంటర్ బోనఫైడ్, ఎస్ఎస్‌సీ జిరాక్స్ కాపీలతో రావాలని సూచించారు. మిగతా వివరాల కోసం పీఈటీ జియావుద్దీన్ (90304 70970) నంబర్‌ను సంప్రదించాలని కోరారు. అదే విధంగా ఈనెల 26న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం 8.30 గంటలకు అండర్–19 బాల, బాలికల ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఇంటర్ బోనఫైడ్, ఎస్ఎస్‌సీ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. మిగతా వివరాల కోసం పీఈటీ భాను (9396439663) నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

రైతాంగాన్ని మోసం చేస్తున్న ప్రభుత్వాలు



దేవరకద్ర: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని మోసం చేస్తున్నాయని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ ఆరోపించారు. శనివారం వెంకటగిరిలో సంఘం ఆవిర్భావ సభలో మాట్లాడారు. ఏటా దేశానికి రూ.15 లక్షల కోట్ల ఆదాయాన్ని ఇస్తున్న రైతాంగానికి బడ్జెట్‌లో కనీసం రూ. 2 లక్షల కోట్లు కూడా కేటాయించడం లేదని విమర్శించారు. గత పదిహేనేళ్లలో ఎరువులు, యంత్రాలు, పనిముట్ల ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. సభలో పత్తికి రూ. 10 వేలు, వరి ధాన్యానికి రూ. 3500 గిట్టుబాటు ధర ఇవ్వాలని, కోయిల్‌సాగర్ పనులు పూర్తి చేయాలని తీర్మానం చేశారు. ఆర్ఆర్ మన్యం, సీహెచ్ రాంచందర్, సాంబశివుడు, పుట్టరాజు పాష, తిరుపతయ్య, జయరాములు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొండారెడ్డి, కార్యదర్శిగా నర్సిములు, కోశాధికారిగా అంజిరెడ్డి, సభ్యులుగా రాజిరెడ్డి, శివారెడ్డి, కిష్టారెడ్డి, అంజనేయులు, నర్సింహులును ఎన్నుకున్నారు.

పాలమూరు నుంచే ఎన్నికల శంఖారావం

- అక్టోబర్ 1న ప్రధాని మోదీ సభ



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్, చిత్రంలో మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

పాలమూరు: రాబోయే అసెంబ్లీ ఎన్నికల శంఖారావం పూరించడానికి ప్రధాని మోదీ పాలమూరుకు వస్తున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అక్టోబరు 1న మధ్యాహ్నం ఒంటిగంటకు అమిస్తాపూర్ సమీపంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొంటారని.. 2019 పార్లమెంట్ ఎన్నికల తర్వాత మొదటిసారి జిల్లాకు వస్తున్నందున సభను విజయవంతం చేస్తామని తెలిపారు. జిల్లా నాయకత్వం, పార్టీ కార్యకర్తలు భారీ జన సమీకరణ చేయాలని కోరారు. ఏళ్లుగా అమలుకు నోచుకోని మహిళ రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందిన తర్వాత మొదటిసారి జిల్లాకు వస్తున్నందున మహిళలతో భారీ స్వాగతం పలికే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడానికి ఇప్పటి నుంచే పనులు ప్రారంభం చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని.. విజయ అవకాశాలు ఉన్న వారిని పార్టీ గుర్తిస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలమూరు ప్రజలను మోసం చేశారని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తిగాకపోయినా 9 మోటార్లుంటే ఒకే మోటారు ప్రారంభించి కొన్ని గంటల్లో నిలిపివేశారని తెలిపారు. ఒక్క మోటారుతో వచ్చే నీటితో పాలమూరును ఎలా సస్యశ్యామలం చేస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి జిమ్మిక్కులు చేస్తున్నాయని.. 50 ఏళ్లుగా కాంగ్రెస్‌పార్టీ అవినీతికి కేరాఫ్‌గా మారిందన్నారు. బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ మైండ్ గేమ్‌లను చిన్నభిన్నం చేస్తామన్నారు. కర్ణాటకలో మోసపూరిత ప్రకటనలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అదే ఫార్ములాను తెలంగాణలో అమలు చేస్తామని చెబుతున్నా.. ఇక్కడి ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ పాలమూరు జిల్లా రైతులకు సాగునీరు ఇచ్చినట్లు హైదరాబాద్‌లో ఎక్కడ చూసినా కటౌట్లు, బ్యానర్లు కట్టి డబ్బా కొట్టుకుంటున్నారన్నారు. 75 ఏళ్లలో ఎప్పుడూ లేనివిధంగా జాతీయ రహదారులు అభివృద్ధి చెందాయని వివరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, పద్మజారెడ్డి, ఎగ్గని నర్సింహులు, బాలరాజు, సుదర్శన్‌రెడ్డి, కొండయ్య, జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి సమక్షంలో జడ్చర్లకు చెందిన బీఆర్ఎస్ నేత, మాజీ సర్పంచ్ సీతారాం జావర్, విశ్రాంత డీఐజీ కెప్టెన్ శ్రీనివాసులుతో పాటు విశ్రాంత అధికారులు, మరి కొంతమంది పార్టీలో చేరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జితేందర్‌రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వైద్యసిబ్బంది నిరసన

అచ్చంపేట రూరల్: ఆస్పత్రికి వచ్చిన రోగి బంధువులు దాడికి పాల్పడి దూషించారని ఆరోపిస్తూ శనివారం అచ్చంపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది గంటపాటు విధులు నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించిన అనంతరం డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐ అనుదీప్, ఎస్ఐ గోవర్ధన్‌కు ఫిర్యాదు అందజేశారు. ఆస్పత్రి ఎదుట నిలబడి 'మాకు రక్షణ కల్పించాలి' అంటూ నినాదాలు చేశారు. ఇలాంటి ఘటనలు జరిగితే విధులు నిర్వర్తించలేమని.. న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తామని తెలిపారు. మండలంలోని రంగాపూర్‌కు చెందిన దశరథ్ పురుగుమందు తాగడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకొచ్చి హంగామా సృష్టించడంతో వైద్యసిబ్బంది నిరసనకు దిగారు. ప్రస్తుతం బాధితుడు వెల్దండ సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.



ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది